క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు చినారికట్ల విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: రాష్ట్ర స్థాయి వైద్య, విజ్ఞానిక ప్రదర్శనకు మండలంలోని చినారికట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్ ఎంపికైందని హెచ్‌ఎం బి.కోటి రెడ్డి తెలిపారు. ఒంగోలులో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రదర్శనలో పాఠశాల విద్యార్థులు ఎం.నాగసాయి, బి.వీరేంద్ర రూపొందించిన మానవీయ కంచె(ఫెన్సింగ్ ఆఫ్ హ్యూమానిటీ) ప్రాజెక్ట్ ఎంపికై ందని పేర్కొన్నారు. రైతులు తమ పొలాల్లో అడవి పందులు, కోతులు, ఇతర జంతువులు ప్రవేశించకుండా విద్యుత్ కంచె వాడటం ప్రమాదకరమన్నారు. ఈ నేపథ్యంలో అటు అడవి జంతువులు, ఇటు మనుషులకు ప్రాణ హాని లేకుండా 9 వోల్టుల బ్యాటరీ, సోలార్ ప్యానల్ ఉపయోగించి ఫెన్సింగ్ రూపొందించినట్లు వివరించారు. జంతువులు కానీ, మనుషులు కానీ కంచెను తాకినప్పుడు చిన్నపాటి బజర్ మోగి, శరీరం జిల్ అంటుందని తద్వారా జంతువులు భయపడి పారిపోతాయన్నారు. రైతులు ఈ కంచె ఏర్పాటు చేసుకోవడం ద్వారా రాత్రి పూట పొలాలకు కాపలా వెళ్లకుండా ఉండవచ్చాన్నరు. పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఐజాక్ గైడ్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి డీఈఓ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా మెమొంటో, ప్రశంస పత్రాలు అందుకున్న విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆదివారం ప్రత్యేకంగా అభినందించింది. విద్యార్థులకు ప్రోత్సాహకంగా తెలుగు ఉపాధ్యాయుడు రామారావు రూ.2 వేలు అందజేసి రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

పేరుకే నిషేధం.. జోరుగా విక్రయం..!

- సంతనూతలపాడు నియోజకవర్గంలో విచ్చలవిడిగా గుట్కా ప్యాకెట్ల అమ్మకాలు
- ప్రభుత్వ ఆదేశాలు అమలు చేయని అధికారులు
- గుట్కా బారినపడి చిత్తవుతున్న జీవితాలు





మార్కెట్లో అందుబాటులో ఉన్న గుట్కా ప్యాకెట్లు

సంతనూతలపాడు: నియోజకవర్గంలో గుట్కా వ్యాపారం జోరుగా సాగుతోంది. చిరు వ్యాపారులు, విద్యార్థులు, యువత, ఆటోవాలాలు, దినసరి కూలీల వీక్‌నెస్‌ను ఆసరాగా చేసుకుంటున్న దుకాణదారులు విచ్చలవిడిగా గుట్కా ప్యాకెట్లు అమ్ముతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న గుట్కాను ప్రభుత్వం నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసినప్పటికీ సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో బహిరంగంగానే విక్రయిస్తున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలూ జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉండటంతో జోరుగా గుట్కా విక్రయాలు సాగుతున్నాయి. పోలీసులు పలు దుకాణాల్లో అడపాదడపా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారేగానీ.. పూర్తి స్థాయిలో గుట్కా విక్రయాలను అరికట్టలేకపోతున్నారు.

గుట్కా రవాణా ఇలా...

జిల్లా కేంద్రానికి ఆనుకుని సంతనూతలపాడు నియోజకవర్గం ఉండటంతో మండల కేంద్రాల నుంచి మారుమూల పల్లెల వరకూ గుట్కా రవాణా జరుగుతోంది. గ్రామాల్లో సైతం గుట్కా వ్యాపారం జోరుగా సాగుతోంది. నియోజకవర్గంలోని చీమకుర్తిలో గ్రానైట్ గనులు, ఫ్యాక్టరీలు భారీగా ఉండటం, వాటిలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు పనిచేస్తుండటంతో గుట్కా వ్యాపారం పెద్ద మొత్తంలో జరుగుతోంది.

అధిక రేట్లు చెల్లించి మరీ కొనుగోళ్లు...

వ్యాపారులకు గుట్కా అమ్మకాలు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. గతంలో రూ.2 నుంచి రూ.5 వరకు ఉండే గుట్కా ప్యాకెట్ ధర ప్రస్తుతం రూ.10 నుంచి రూ.15 వరకు పలుకుతోంది. గతంలో రూ.5 నుంచి రూ.10 వరకు ఉండే ఖైనీ ప్యాకెట్ ప్రస్తుతం రూ.30 నుంచి రూ.50 వరకు పలుకుతోంది. అదేమని అడిగితే తాము అధిక రేట్లు చెల్లించి వేరే ప్రాంతాల నుంచి తెప్పించుకోవాల్సి వస్తోందని వినియోగదారులపై వ్యాపారులు చిందులు తొక్కుతున్నారు. చేసేదేమీ లేక వారు చెప్పిన రేట్లకు కొనుగోలు చేస్తున్నారు.

వ్యాపారం సాగుతోందిలా...

మండలాల్లోని పలు దుకాణాల నుంచి ఖైనీ, గుట్కా ప్యాకెట్లు గ్రామీణ ప్రాంతాలకు సరఫరా అవుతున్నాయి. వాటిని కిరాణా దుకాణాల యజమానులు రహస్యంగా ఇంట్లో భద్రపరచుకుని బాగా తెలిసిన వారికి మాత్రమే రహస్యంగా విక్రయిస్తున్నారు. అందుకోసం నాలుగైదు రెట్లు అదనంగా వసూలు చేస్తున్నారు. నియోజకవర్గంలోని సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు, నాగులుప్పలపాడులో అధికంగా హీరా, మానిక్ చంద్, పాన్ పరాగ్, రాజా ఖైనీ ప్యాకెట్ల విక్రయాలు జరుగుతున్నాయి. ఎవరికీ అనుమానం రాకుండా పోలీసుల కళ్లుగప్పి కిరాణా సరుకులు తీసుకెళ్లే సంచుల్లో అడుగు భాగంలో వీటిని వేసుకుని తీసుకెళ్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఒంగోలులో కొందరు వ్యాపారులకు బెంగళూరు, తదితర మహానగరాల నుంచి ఖైనీ, గుట్కా ప్యాకెట్లు అధిక మొత్తంలో వస్తున్నాయి. వారి ద్వారా సంతనూతలపాడు నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల్లో గుట్కా వ్యాపారం మూడు పువ్వులు.. ఆరుకాయలు అన్నచందంగా సాగుతోంది.

ఆటోవాలాలు.. యువతే టార్గెట్...

ముఖ్యంగా ఆటో డ్రైవర్లు, యువతే టార్గెట్గా గుట్కా వ్యాపారస్తులు విక్రయాలు కొనసాగిస్తున్నారు. యువత గుట్కా, పాన్‌కు అలవాటుపడి వ్యసనంగా మార్చుకోవడం వల్ల అధికంగా వ్యాపారం జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై గతంలో పోలీసులు పాన్ మసాలా సెంటర్లపై దాడులు నిర్వహించేవారు. ప్రస్తుతం వారు కూడా కాసులకు కక్కుర్తిపడి బహిరంగంగానే గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గుట్కా తింటే నోటి క్యాన్సర్...

గుట్కాలు తింటే నోటి క్యాన్సర్ సమస్యలు మొదలుకుని జీర్ణవ్యవస్థ వరకు అన్నింటిపై ప్రభావం పడుతోంది. పళ్లు అరిగిపోయి గార పడతాయి. నాలుక రుచిమొగ్గలు నశిస్తాయి. చివరకు నోరు, నాలుక, గొంతుకు క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. వీటివల్ల ప్రాణనష్టం కూడా జరగొచ్చు.

రజక వృత్తిదారుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి



రజకవృత్తిదారుల సంఘ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: రజక వృత్తిదారుల సంక్షేమానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా రజక వృత్తిదారుల సంఘ అధ్యక్షుడు టంగుటూరు రాము డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని మాదాల వీరాస్వామి, పిచ్చమ్మ సమావేశ మందిరంలో నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగన సభలో ఆయన ప్రసంగిస్తూ బతుకుదెరువు కోసం అనేక మంది రజకవృత్తిదారులు పట్టణానికి వచ్చి చాలీచాలని ఇరుకు గదుల్లో జీవిస్తున్నారని తెలిపారు. అపార్ట్‌మెంట్లలో వాచ్‌మెన్‌గా, ఇంటి పని వారిగా బతుకుబండి లాగుతున్నారన్నారు. ప్రభుత్వం రజకవృత్తిదారులకు బతుకు భరోసా కల్పించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల మాలకొండయ్య ప్రసంగిస్తూ రజక వృత్తిదారులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, ఇస్త్రీ చేసే వారికి నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని, ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మాణం చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రజక వృత్తిదారులు భూములను ఆక్రమించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘ నాయకులు ఆవులమంద రమణమ్మ, డాక్టర్ కృష్ణయ్య, చీమకుర్తి కోటేశ్వరరావు, మంచికలపాటి శ్రీనివాసరావు, యోగమ్మ, పోలయ్య, వెంకటనారాయణ, బాలచెన్నయ్య, కల్లగుంట శ్రీను, పాదిలి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

12న ముగ్గుల పోటీలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విశ్వవికాస భారతి సేవా సభ్యులు

ఒంగోలు మెట్రో: విశ్వవికాస భారతి సేవా సంస్థ ఒంగోలు వారి ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ ఒంగోలు నగరంలోని శర్మ కాలేజీ మైదానం వద్ద నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల కరపత్రాలను స్థానిక కర్నూలు రోడ్డులోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం వద్ద ఆదివారం ఆవిష్కరించారు. విశ్వవికాస భారతి సేవా సంస్థ అధ్యక్షుడు పోతులూరి శివబ్రహ్మాచార్యులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు నూతలపాటి శివప్రసాదరావు, కార్యదర్శి కొత్తపల్లి సాయిబాబు, ఇంకొల్లు మధు ఆచార్యులు, నల్లపాటి కుమారస్వామి, పాలెపు వెంకటేశ్వర్లు, ఏల్చూరి ప్రదీప్‌శాస్త్రి పాల్గొన్నారు.

మాదిగ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మాదిగ ఉద్యోగులు

మద్దిపాడు: మాదిగ ఉద్యోగుల క్యాలెండర్‌ను ఆదివారం మద్దిపాడులో ఆవిష్కరించారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు తోరటి ఆనంద్ మాదిగ పాల్గొని మాట్లాడారు. ఎస్సీ ఉపకులాల ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రా మద్దిపాడు ఎస్సీకాలనీలో పర్యటించి సమస్యలు గుర్తించడం అభినందించదగిన విషయమన్నారు. సోమవారం ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న వినతిపత్రాల స్వీకరణ కార్యక్రమానికి భారీగా మాదిగలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మాదిగ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమైక్య జాతీయ ఉపాధ్యక్షుడు బొంత ఏసుదాసు, జిల్లా అధ్యక్షుడు కత్తి ఐజాక్, ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి శేషయ్య, ఎంఈఎఫ్ జిల్లా సహ ప్రధాన కార్యదర్శి లక్కనబోయిన కోటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కావూరి విజయరాజు, పాటిబండ్ల దేవరాజు, గుంటూరి ఆదాం, టి.నాగరాజు, పాటిబండ్ల మాణిక్యరావు, పాటిబండ్ల చిన్నకోటేశ్వరరావు, హనుమంతురావు, తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిన నేతలు



సంతనూతలపాడు: హైందవ శంఖారావ సభకు తరలివెళ్తున్న మండల ప్రజలు

సంతనూతలపాడు: ఆలయాలకు ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి కలిగించి స్వయం ప్రతిపత్తి కలిగిన ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగించేలా చట్ట సవరణలు చేయాలని డిమాండ్ చేస్తూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ సమీపంలోని గన్నవరం కేసరపల్లిలో నిర్వహించిన భారీ బహిరంగ సభ హైందవ శంఖారావానికి సంతనూతలపాడు మండలం నుంచి పలు వాహనాల్లో నాయకులు, అభిమానులు, భక్తులు, వివిధ పార్టీల నేతలు తరలివెళ్లారు. సంతనూతలపాడులోని చెన్న కేశవస్వామి ఆలయం వద్ద నుంచి ఏర్పాటు చేసిన వాహనాలను బీజేపీ మండల అధ్యక్షుడు తెల్లమేకల శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. తక్కెళ్లపాడు, గుమ్మలంపాడు, మద్దులూరు, గుడిపాడు, సంతనూతలపాడు, పేర్నమిట్ట తదితర ప్రాంతాల నుంచి వాహనాలలో తరలివెళ్లారు.



ఒంగోలు నుంచి బయలుదేరుతున్న వివిధ విభాగాల ప్రతినిధులు

ఒంగోలు నుంచి రెండు వేల మందికిపైగా తరలిన హిందువులు...

ఒంగోలు మెట్రో: హైందవ శంఖారావం బహిరంగ సభకు ఒంగోలు నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 23 బస్సులు, ఇతర వాహనాలలో రెండు వేల మందికిపైగా హిందువులు తరలివెళ్లారు. విశ్వహిందూ పరిషత్ ప్రాంత సత్సంగ్ ప్రముఖ్ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం కన్వీనర్ సోమా సుబ్బారావు, వీహెచ్‌పీ, వివిధ విభాగాల ప్రతినిధుల సమన్వయంతో ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల ద్వారా విజయవాడ సభకు భారీగా తరలివెళ్లారు. ప్రముఖులు రాధ రమణగుప్తా జంధ్యం, రెడ్డి మల్లికార్జునరావు, ధనిశెట్టి రాము నాయుడు పర్యవేక్షించారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ

మార్కాపురం టౌన్: స్థానిక అల్లూరి పోలేరమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు కుంకుమ బండ్లతో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ సమీపంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు. అలాగే కళాశాల రోడ్డులోని పోలేరమ్మ తల్లి ఆలయంలో అర్చకుడు అమర్‌నాథ్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.



కళాశాల రోడ్డులో పూజలందుకుంటున్న పోలేరమ్మ తల్లి

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణ



పారాయణంలో పాల్గొన్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో విశ్వాస్ మద్రాస్‌కి చెందిన టీజే శ్రీధరన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక మహిళా భక్తులు హరిప్రసాద్ బృందం సామూహికంగా పాల్గొని విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ అళహరి చంచలరావు పాల్గొని మాట్లాడుతూ మందిరంలో జరిగే ప్రతి ఉత్సవాలలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేస్తున్నందుకు అభినందించారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



కేవీ అగ్రహారంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



సంతనూతలపాడు: పూజలు చేస్తున్న భక్తులు

సంతనూతలపాడు: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో 21వ రోజు ధనుర్మాస పూజలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. డిసెంబర్ 16వ తేదీ ప్రారంభమైన ధనుర్మాస వేడుకలు జనవరి 15వ తేదీతో ముగియనున్నట్లు ఆలయ అర్చకుడు పి.అజయ్‌బాబు తెలిపారు. ఆంజనేయస్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 21వ రోజు ఆదివారం ధనుర్మాస పూజలో పచ్చిశెట్టి ఆంజనేయులు, పాదర్తి సుబ్రహ్మణ్యం, ముద్రగడ శివ దంపతులు కూర్చున్నారు. ఈ నెల 10వ తేదీ ముక్కోటిని పురస్కరించుకుని స్వామివారికి ద్వార దర్శనం, గ్రామోత్సవం నిర్వహించనున్నారు. 11వ తేదీ గంగాల ఉత్సవం ఘనంగా జరగనుంది. 15న ముగింపును పురస్కరించుకుని స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలు ఘనంగా జరుగుతున్నాయి.

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి రూరల్: మండలంలోని కేవీ అగ్రహారం గ్రామంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 21వ రోజు ధనుర్మాస వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోదాదేవి కళ్యాణ వ్రత మహోత్సవంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెంకటేశ్వరాచార్యులు, పంచాంగం ప్రవచకులు రామానుజాచార్యులచే గోదాదేవి 21వ పాశుర ప్రవచనాలు జరిగాయి. 21వ రోజు కళ్యాణ వ్రత మహోత్సవంలో దాదాపుగా 70 జంటలు పాల్గొన్నాయి. పూజా కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి విశేష పూజలతో పాటు అభిషేకం నిర్వహించి నూతన పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలలతో అలంకరించారు. పూలమాలలతో స్వామి, అమ్మవారి అలంకరణ అందరినీ ఆకట్టుకుంది. భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వచనాలు అందుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆపిల్, కేఎస్‌జీ సంస్థ సహకారంతో 2000 మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శిద్దా హనుమంతరావు దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, పలు ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా గోపూజ, మహానివేదన

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో మహానివేదన, గోపూజ అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఆదివారం వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులకు అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా గోపూజా మందిరంలో గోపూజ నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్ నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు